క్లుప్తంగా

ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గత మూడు రోజులుగా జాతీయ స్థాయిలో జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ – 2025 శుక్రవారంతో ముగిసింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి మాట్లాడుతూ ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో జాతీయ స్థాయిలో హ్యాకథాన్ నిర్వహించామన్నారు. దాదాపు 123 టీమ్స్ పాల్గొనగా వారికి గ్రామీణాభివృద్ధి, రోబోటిక్స్, డ్రోన్స్, టోమేషన్, స్పేస్ టెక్నాలజీ వంటి అంశాలపై పోటీ నిర్వహించామని తెలిపారు. గెలుపొందిన జట్లకు ప్రోత్సాహక బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్‌ల పంపిణీ



గన్నవరం: పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు తోడ్పాటునందించాలని లిటిల్ హూప్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు విఘ్నేష్ సున్నపు పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లి శివారు చెంచులకాలనీకి చెందిన 80 మంది విద్యార్థులకు శుక్రవారం విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లిటిల్ హూప్ ట్రస్ట్ సహకారంతో స్కూల్ బ్యాగ్‌లు, నోట్‌బుక్‌లు, అభ్యాస సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ.. మురికివాడల్లో నివసిస్తున్న అణగారిన వర్గాల పిల్లల విద్య, సంక్షేమం కోసం తమ ట్రస్ట్ అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. ట్రస్ట్ కార్యదర్శి పవన్‌కుమార్, సభ్యులు వెంకటరమణ థోంరంగి, చిన్నారావు, కొమ్ము జాస్మిన్, జోసఫ్, డాక్టర్ జీవనా బ్లెస్సీ, మణికొండ జోన్స్, సంగాసాని వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయండి



కంకిపాడు: ఈ–క్రాప్ నమోదు వేగంగా పూర్తి చేయాలని ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ ఆదేశించారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో శుక్రవారం ఆమె వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి ఈ–క్రాప్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెలాఖరుతో గడువు పూర్తి కాబోతున్న రీత్యా నమోదుపై రైతుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ప్రతి ఒక్క రైతు పంట వివరాలను నమోదు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.భావనారాయణ, మండల వ్యవసాయాధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



కంకిపాడు: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టంచేశారు. అసోసియేషన్ కంకిపాడు తాలూకా కార్యవర్గ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ వెస్ట్ కృష్ణా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు అండగా సంఘం నిలబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెస్ట్ కృష్ణా కార్యదర్శి రమేష్, కంకిపాడు యూనిట్ అధ్యక్షుడు పురుషోత్తమ రాజు, కార్యదర్శి కృష్ణారావు, ఉయ్యూరు యూనిట్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమానికి అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

చాకలి ఐలమ్మకు నివాళి



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని రంగా బొమ్మ సెంటర్‌లో శుక్రవారం రాత్రి ప్రముఖ ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రజకులు చాకలి ఐలమ్మ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వల్లూరు శివ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే

శోభాయమానంగా నవరాత్రి ఉత్సవాలు

గన్నవరం: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు శోభాయమానంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దావాజీగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మిగా పూజలందుకున్నారు. అమ్మవారికి అలంకరించిన రూ. 40 వేలు కరెన్సీ నోట్ల దండ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక గాయత్రి మందిరం, శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం, యాదవులపేట రామాలయంలో శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. అలాగే శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీమంగళగౌరీదేవిగా అమ్మవారిని అలంకరించారు. కేసరపల్లి, బుద్దవరం గ్రామాల్లోకూడా దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

మహాలక్ష్మిగా పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునే అమ్మవార్లను రకరకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయంలో ప్రదర్శించిన కూడిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

స్థితికారిణీ.. మహాలక్ష్మీ

ఉయ్యూరు: లోక స్థితికారిణీ.. శ్రీమహాలక్ష్మీ అంటూ భక్తులు ధనధాన్యభోగభాగ్యాలు ప్రసాదించమ్మా అంటూ శుక్రవారం అమ్మవారిని పూజించారు. పెద ఓగిరాల, ఉయ్యూరు, చిన ఓగిరాల, గండిగుంట తదితర గ్రామాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నున్న(విజయవాడరూరల్): నున్నలో శుక్రవారం శ్రీకనకదుర్గమ్మ వారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోనూ, పి.నైనవరం గ్రామం శ్రీ శివ నాగేంద్రస్వామి ఆలయంలోనూ, చినకంచిలోనూ అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు.

సామూహిక కుంకుమ పూజలు

కంకిపాడు: శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చి భక్తుల పూజలందుకున్నారు. కంకిపాడు శివాలయం ఉత్సవ కమిటీ ప్రతినిధులు గంగానమ్మ తల్లికి ఆలయం తరపున సారె సమర్పించారు. కంకిపాడు, ఈడుపుగల్లు, మద్దూరు, మంతెన, ఉప్పలూరు, ప్రొద్దుటూరు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని మంతెన గ్రామంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.



దావాజీగూడెంలో అమ్మవారికి అలంకరించిన కరెన్సీ నోట్ల దండ



చినకంచిలో మహాలక్ష్మి అలంకరణ



పెనమలూరులో అమ్మవారు



పోరంకిలో మహాలక్ష్మీదేవి అలంకరణ

స్కందమాతాదేవిగా పార్వతీదేవి

పెనమలూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీకనకదుర్గమ్మను శుక్రవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. పోరంకి గ్రామ దేవత గంగానమ్మను ప్రత్యేకంగా నోట్ల కట్టలతో అలంకరించారు. అలాగే పెనమలూరు సీతారామాలయంలో అమ్మవారిని నోట్ల కట్టలతో అలంకరించారు. యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని స్కందమాతాదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు. లాకు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. చోడవరం శ్రీనాగేంద్రస్వామివారి ఆలయం, పెదపులిపాక శ్రీవిజయరాజరాజేశ్వరి ఆలయంతో పాటు గ్రామాల్లోని దేవాలయాల్లో దసరా శరన్నవరాత్రులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి.



యనమలకుదురులో స్కందమాతగా పార్వతీదేవి



రామవరప్పాడులో మహాలక్ష్మిగా పేరంటాలమ్మ



పెద ఓగిరాలలో మహాలక్ష్మిగా భ్రమరాంబ దేవి



ఉయ్యూరులో గజలక్ష్మీదేవిగా విజయదుర్గమ్మ



కంకిపాడు శివాలయంలో..



కంకిపాడులో మహాలక్ష్మిగా వాసవీమాత



మద్దూరులో మహాలక్ష్మీదేవి అలంకరణ



కంకిపాడు గంగానమ్మ తల్లికి సారె సమర్పిస్తున్న శివాలయం ఉత్సవ కమిటీ సభ్యులు

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పెనమలూరు: గర్భిణులు మంచి పోషకాహారం తీసుకుని ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవి సూచించారు. గోసాల గ్రామంలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం – 2025లో భాగంగా మండల స్థాయిలో గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రణవి మాట్లాడుతూ గర్భిణు లు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని డాక్టర్ సలహాలు పాటించాలని తెలిపారు. సీడీపీవో కె.బేబీ సుకన్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేసి కొత్త బట్టలు పంపిణీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు వి.పద్మావతిదేవి, కె.కూర్మానావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ ఎల్.సులోచన రాణి, కె.శ్రీలత, జి.విజయలక్ష్మి, ఉపసర్పంచి షేక్ దాదా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య శాఖ సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

గన్నవరం: మండలంలోని దావాజీగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె. సత్యవాణి మాట్లాడుతూ ఇంటి వద్ద లభించే మునగాకు, ఆకుకూరలు, మిల్లెట్స్‌ను ఆహారంగా తీసుకోవాలని చెప్పారు. ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. అలాగే ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలో జరిగిన మాసోత్సవంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్ కె. జ్యోతి, సెక్టారు సూపర్‌వైజర్ పద్మాదేవి, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఉయ్యూరు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. మెప్మా కార్యాలయ ఆవరణలో పోషక మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషకాహార పదార్థాలను చైర్మన్, అధికారులు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో మెప్మా ప్రతినిధి ఎం.దయావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాఘవమ్మ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.



గోసాల సీమంతంలో అధికారులు, నేతలు



పొట్టిపాడు సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ



ఉయ్యూరులో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

పెనమలూరు: విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని మండల తహసీల్దార్ గోపాలకృష్ణ సూచించారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ర్యాగింగ్, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాతూ మండలంలో ఉన్న ఇంజినీరింగ్ కాలేజీలో గత కొద్ది సంవత్సరాలుగా ఎటువంటి ర్యాంగింగ్‌లు జరగలేదన్నారు. ఇక ముందు కూడా విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లరాదని సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎస్‌ఐ సత్య సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని కోల్పోవద్దని సూచించారు. మాదకద్రవ్యాలు వినియోగించే వారి వివరాలు తెలిపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మనాభ రాజు, డాక్టర్ సూర్యప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ నిరంజన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కానూరులో ప్రసంగిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో శుక్రవారం ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వీధులను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శుభ్రం చేయడంతో పాటు 50 మొక్కలను నాటారు. పరిసరాల పరిశుభ్రత – ఆరోగ్య సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ, గ్రామాల పరిశుభ్రత కోసం ప్రతిఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క అయిన నాటడంతో పాటు వాటిని సంరక్షించి సమాజానికి మేలు చేయాలని కోరారు. విద్యార్థుల్లో సామాజిక భావం పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.శ్రీహరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

నున్న(విజయవాడరూరరల్): నున్న గ్రామం వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శుక్రవారం విద్యార్థులు ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోటా పోటీగా ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని సూచించారు. 40 ఏళ్ల భవిష్యత్తును విద్యార్థి దశలోనే ఏర్పర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్. సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పెనమలూరు: తాడిగడపలో వివాహిత అదృశ్యమైన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. తాడిగడప ఇంజినీరింగ్ కాలేజీ ఎదురు కాలువ కట్టపై భార్యభర్తలు ఇస్మాయిల్, బర్కతున్నిసా కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. అయితే బర్కతున్నీసాకు మతిస్థిమితం లేకపోవడంతో గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె కోసం కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

'అందరికీ న్యాయం'పై పోటీలు

గన్నవరం: న్యాయ సహాయం ద్వారా అందరికీ న్యాయంపై పోటీలు నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.అరుణశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ సహాయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని ప్రజలు, కవులు, కళాకారులు, యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 'న్యాయ సహాయం ద్వారా అందరికీ న్యాయం'పై ఫొటోగ్రఫీ, స్కెచ్, వీడియోలు, పెయింటింగ్ రూపొందించి అక్టోబర్ 3వ తేదీలోపు మండల లీగల్ సెల్ కమిటీ ఆఫీస్‌లో సమర్పించాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు సెలవుల్లో నైపుణ్య శిక్షణ

ఉయ్యూరు రూరల్: దసరా సెలవులను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా ఇంటర్‌షిప్ ద్వారా నైపుణ్యతను పెంపొందించుకుంటున్నారు. మండలంలోని ఆకునూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ బ్యాంకులతోపాటు ప్రైవేటు ఆటోమొబైల్ రంగంలోని షోరూమ్‌లను సందర్శించి పలు విషయాలు తెలుసుకుంటున్నారు. స్వయం ఉపాధికి అవసరమైన వివిధ రంగాల్లో రాణించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ పథకం కింద విద్యార్థినులకు ఆటోమోటివ్, బ్యాంకింగ్, ఫైనాన్స్ సెక్టార్ ఇంటర్న్‌షిప్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఆటోమోటివ్, బీఎఫ్ఎస్ఐ కోర్సులపై దసరా సెలవుల్లో 10 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు ఒకేషనల్ శిక్షకులు కృష్ణ కిషోర్, వేణుమాధవ్ తెలిపారు. ఆటోమోటివ్ కోర్స్‌కు సంబంధించి ఉయ్యూరు పట్టణంలో యమహా బైక్ షోరూమ్‌కు శుక్రవారం విద్యార్థినులను ఉపాధ్యాయులు తీసుకెళ్లి సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్‌పై శిక్షణ ఇచ్చారు. బీఎఫ్ఎస్ఐ కోర్స్‌కు సంబంధించి ఉయ్యూరు పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులకు విద్యార్థులను తీసుకెళ్లి నగదు జమ చేయడం, నగదు తీసుకోవడం, బ్యాంక్ అకౌంట్ ఖాతా తెరవడం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా జీసీడీఓ సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయురాలు అనంతలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



యమహా షోరూంలో బైక్ మెకానిక్ వర్క్ చేస్తున్న విద్యార్థినులు

ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రముఖ పారిశ్రామిక వేత్త, విశ్వ హిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ రూ.75 వేలతో 14 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరా వ్యవస్థను గన్నవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించి పుట్టగుంటను డిపో మేనేజర్ శివాజీ అభినందించారు. బస్‌స్టేషన్‌లో జేబు దొంగలు, ఆకతాయిలు, అసాంఘిక శక్తుల ఆగడాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తామని పేర్కొన్నారు. నూజివీడు డిపో సూపర్‌వైజర్ కృష్ణప్రసాద్, స్థానిక ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు సిగ్గుచేటు

అంబాపురం(విజయవాడరూరల్): సభ్యత, సంస్కారం లేకుండా అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని అంబాపురం గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖరరావు పేర్కొన్నారు. శుక్రవారం అంబాపురం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ బాలకృష్ణ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మానసిక సైకోగా బాలకృష్ణ అందరికి తెలుసని ఎద్దేవా చేశారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు హేయం

గన్నవరం రూరల్: ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు హేయమని సూరంపల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కందిమళ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చట్ట సభల్లో మాట్లాడే సందర్భంలో బాలకృష్ణ తీరు ప్రజాస్వామ్య వాదులకు ఎంతో ఇబ్బందిగా ఉందని అన్నారు. ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న ప్రతి ఒక్కరు ఈ వ్యాఖ్యలు ఖండించాలని కోరారు. బాలకృష్ణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఈవోపీఆర్డీ లక్ష్మయ్య శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీలో ఆదాయ, వ్యయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మరికొంత మంది గ్రామస్తులు కూడా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులపై లిఖితపూర్వక ఫిర్యాదులను ఈవోపీఆర్డీ లక్ష్మయ్యకు అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, తాజాగా అందిన ఫిర్యాదులను కూడా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కరాటేతో శారీరక, మానసిక దృఢత్వం

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు చదువుతో పాటు కరాటే నేర్చుకోవడం వల్ల శారీరక, మానసిక దృఢత్వం సాధిస్తారని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ జె. సంధ్య మాధురి పేర్కొన్నారు. శాంతినగర్‌లో క్యోకు కరాటే అకాడమీ ఆధర్యంలో శుక్రవారం ట్రెనింగ్ క్యాప్ అండ్ బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ సంధ్య మాధురి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన కరాటే విద్యార్థులు ముస్ముందు జరిగే కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన విజన్ మార్షల్, అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎం.విఠల్, కన్నా తదితరులు పాల్గొన్నారు.